క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ 33/11 కేవీ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఇక్కడ ఎస్ఎస్ పరిధిలో ఉన్న పైనాపిల్ కాలనీ, కామాక్షినగర్, సీబీడీ కార్యాలయం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురం, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్, కనకమహాలక్ష్మినగర్, పాండురంగాపురం, శ్రీకాంత్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, శివాజీనగర్, ప్రగతి నగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, పోలీస్ స్టేషన్, టీబీసీ పాయింట్, నెహ్రూనగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరిధిలోని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ బాలయ్యశాస్త్రి లేఅవుట్, 11 కేవీ శాంతిపురం, 11 కేవీ సీతంపేట ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎస్ఆర్ఐ హాస్పిటల్, బీఎస్ లేఅవుట్, మోర్ సూపర్ మార్కెట్, శాంతిపురం, సీతంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అమ్మినాయుడు

ఎంవీపీ కాలనీ: ఆర్టీసీ డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.అమ్మినాయుడు కోరారు. వాల్తేర్ డిపోలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులను బస్టాప్‌ల వద్ద క్రమ పద్ధతిలో నిలపాలన్నారు. బస్సుల్లో ఫుట్‌పాత్‌లపై యువకులు నిలుచోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎ.గణేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇంజినీరింగ్, ఇన్‌ఫోర్స్‌మెంట్, భద్రత చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉల్లి విక్రయాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో ఉల్లిపాయల కోసం వినియోగదారులు బారులు తీరారు. సంక్రాంతి పండగ సెలవుల్లో ప్రజలు సొంతూళ్లకు వెళ్లడంతో ఉల్లితోపాటు కూరగాయలు బజార్‌లో లేకపోవడంతో వ్యాపారాలు సాగలేదు. నాలుగు రోజులుగా రైతులు లేక వెలవెలబోయిన రైతుబజార్.. గురువారం వినియోగదారులతో కిటకిటలాడింది. భారీగా జనం రావడంతో బజార్ ఈవో, సహాయకుడు స్పందించి నాలుగు ఉల్లి విక్రయాల కౌంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుని ఉల్లిపాయలు కొనుగోలు చేశారు. కర్నూల్ ఉల్లి(ఎరుపు) కిలో రూ.22, మరో క్వాలిటీ కిలో కిలో రూ.24 చొప్పున విక్రయించారు.

పోలీసుల అదుపులో జూదరులు

మద్రిపాలెం: పేకాట శిబిరంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు మహిళలతోపాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.13 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందాల సిరి.. కైలాసగిరి

- అదనపు వసతులతో ఆకట్టుకుంటున్న పర్యాటక ప్రాంతం
- ఇటీవల సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటుకు శ్రీకారం



రాతి విగ్రహాలు



కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు

ఆరిలోవ : నగరంలో కైలాసగిరి పర్యాటకులకు ఆణిముత్యంగా నిలిచింది. ప్రశాంత వాతావరణం, చల్లని సముద్రం గాలులు ఇక్కడ ప్రత్యేకం. ఈ కొండపై నుంచి సందర్శకులు సముద్రం అలలను ఆస్వాదించడమే కాకుండా నగర అందాలను చూడవచ్చు. కొండపై శివపార్వతుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిల్లలు ఆటలాడుకోవడానికి విశాలమైన మైదానాలు, వాటిలో పలు రకాలైన ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పచ్చని లేన్లతో తయారు చేసిన విశాలమైన పార్కులు, రాతి విగ్రహాల పార్కు, చుట్టూ వివిధ రకాల పూల మొక్కలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీంతో పాటు రేడియో కేంద్రం, వెంకటేశ్వరుని శంకు నామాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఇక్కడ వీఎంఆర్‌డీఏ పలు అభివృద్ధి పనులు చేపడుతోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణం కోసం ఇటీవల మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున శంకుస్థాపన చేశారు. గతేడాది మార్చిలో నగరంలో జరిగిన జీ–20 సదస్సులో భాగంగా ఇక్కడ రాతి విగ్రహాల పార్కును ఆధునికీకరించారు. వీటి మధ్యలో ఫుట్‌పాత్‌లు, పూల మొక్కల పార్కును ఏర్పాటు చేశారు.

రోప్‌వే..

కైలాసగిరి కొండపైకి రోప్‌వే సౌకర్యం కల్పించారు. అప్పుఘర్ మెట్ల మార్గం నుంచి కొండపైకి రోప్‌వే నిర్వహిస్తున్నారు. దీనికి రెండు వైపులా(కొండపైకి వెళ్లి తిరిగి రావడానికి) రూ.100 టికెట్ తీయాలి. ఒక వైపు మాత్రమే వెళ్లడానికి రూ.60 టికెట్ తీసుకోవాలి.



పిల్లల ఆట పరికరాలు

ఆకట్టుకుంటున్న తెలుగు మ్యూజియం

ఇక్కడ తెలుగు మ్యూజియం సందర్శకులను ఆకట్టుకుంటోంది. కైలాసగిరికి రోజూ వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. అందులో ఎక్కువ మంది ఈ మ్యూజియాన్ని సందర్శిస్తుంటారు. దీని నిర్మాణానికి 2008లో బీజం పడింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దీన్ని నిర్మించతలపెట్టారు. కొండపై దీని కోసం 6 ఎకరాల స్థలం కేటాయించారు. దానిలో 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.15 కోట్లతో మ్యూజియం నిర్మించారు. 2015 నవంబరులో అందుబాటులోకి తీసుకొచ్చారు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దం నుంచి క్రీ.శ 20వ శతాబ్దాం వరకు తెలుగు భాష, సంస్కృతికి కృషి చేసిన 64 మంది ప్రముఖుల విగ్రహాలను ఈ మ్యూజియంలో ఏర్పాటు చేశారు. ఇందులో 100 మంది కూర్చొని చూడడానికి వీలు కలిగేలా రొటేట్ చైర్స్‌తో కూడిన ఆడిటోరియం ఏర్పాటు చేశారు. ఇది కంప్యూటర్ ద్వారా తిరుగుతుంది. దీనిలో తిరుగుతున్న సమయంలో ప్రతి విగ్రహం ఎదురుగా వెళ్లేటప్పుడు లైటింగ్ పడుతుంది. ఆ విగ్రహం గురించి సినీ యాక్టర్ సాయికుమార్ వాయిస్‌తో సందర్శకులకు వ్యాఖ్యానం వినిపిస్తుంది. దీంతోపాటు రాష్ట్రంలో 13 జిల్లాల ప్రాముఖ్యత గురించి తెలిపే చిత్రాలు(ఫొటోలు) ఈ మ్యూజియంలో పొందుపరిచారు. దీని లోపలకు ప్రవేశించడానికి ప్రతి ఒక్కరు రూ.20 టికెట్ తీసుకోవాలి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.



కైలాసగిరిపై తెలుగు మ్యూజియం

అందుబాటులో సర్క్యూట్ ట్రైన్

కొండపై సర్క్యూట్ ట్రైన్ అందుబాటులో ఉంది. కొండపై పార్కు చుట్టూ రెండు కిలోమీటర్లు తిరుగుతుంది. దీనిపై ఎక్కేవారు ఓ పక్క పార్కులో అందాలతో పాటు కొండ దిగువున నగరం, సముద్రం, కొండలు తిలకించవచ్చు. దీనిలో ఏసీ, నాన్ ఏసీ బోగీలున్నాయి. ఏసీ బోగీలు ప్రయాణించడానికి పెద్దలకు రూ.110, పిల్లలకు రూ.80, నాన్ ఏసీ బోగీలో ప్రయాణించడానికి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50 టికెట్ చెల్లించాలి. దీనికి ప్లాట్‌ఫారం నిర్మించారు. సాధారణ రైల్వే స్టేషన్‌లో ఉన్న మాదిరిగా ఇక్కడ ప్రకటనలు చేస్తారు.



సర్క్యూట్ ట్రైన్

సందర్శనకు టికెట్ల ధరలు ఇలా..

కైలాసగిరి సందర్శనకు అప్పుఘర్ వద్ద, జాతీయ రహదారి వైపు హనుమంతవాక వద్ద మెట్ల మార్గాలున్నాయి. విశాలాక్షినగర్ నుంచి ఏఆర్ పోలీస్ క్వార్టర్స్ మీదుగా రోడ్డు మార్గం ఉంది. మెట్ల మార్గం నుంచి గానీ, రోడ్డు మార్గం నుంచి గానీ కాలి నడకన వెళ్లేవారు రూ.5 టికెట్ తీసుకోవాలి. రోడ్డు మార్గంలో బస్‌లో వెళ్లిన వారు రూ.5 టికెట్ చెల్లించాలి. ద్విచక్ర వాహనానికి–రూ.20, కారుకు–రూ.50, ఫోర్ వీలర్(ఏడు సీట్లు)–రూ.70, వ్యాన్‌కు–రూ.150, బస్‌కు–రూ.300 చెల్లించాలి. దీనిపైకి వెళ్లడానికి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నేరుగా సిటీ బస్సులు ఉన్నాయి.



కొండపై వెంకటేశ్వరుని శంకు చక్రాలు

పరసల సందడి

- 'తూర్పు'లో ప్రారంభమైన జాతరలు
- వెంకోజీపాలెంలో కోదండరామ లీల జాతర
- పెదవాల్తేరు ఘనంగా పోలమాంబ పరస



పోలమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



విద్యుద్దీపాల అలంకరణలో పోలమాంబ ఆలయం

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో పరసల సందడి ప్రారంభమైంది. సంక్రాంతి తర్వాత వచ్చే కనుమ నుంచి పరసలు జరుగుతాయి. దీనిలో భాగంగా కొత్త వెంకోజీపాలెంలో శ్రీకోదండ రామలీల జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో పాటు జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత ఆలయాన్ని స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రదర్శించిన సాముగరిడీలు, కోలాటం, నేల వేషాలు, బుర్రకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పలు గృహోపకరణాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా జోషిలా, మద్దాల భాను, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, కాంగ్రెంగుల నూకేశ్వరరావు, కళ్ల శంకర్, బోరా ధనరెడ్డి, ఆడారి కామేశ్వరరావు, ఎర్రాజీ, ఆడారి శ్రీను, పీలా ప్రేమ్‌కిరణ్ పాల్గొన్నారు.

నేడు ఇసుకతోటలో నెత్తల పరస

జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలో నెత్తల పరస శుక్రవారం జరగనుంది. గ్రామంలోని సూరిశెట్టి కుటుంబీకులు నిర్మించిన ఆలయంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. అలాగే మద్దిలపాలెం, రేసపువానిపాలెం, పెదవాల్తేరు, పాత వెంకోజీపాలెం, ఆరిలోవ ప్రాంతాలలో పరసలు జరగనున్నాయి.

ఘనంగా పోలమాంబ అమ్మవారి పరస

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస గురువారం ఘనంగా జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో నేల వేషాలు, సాముగరిడీలు, చెక్క భజనలు, కోలాటం నడుమ పరస సందడిగా సాగింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వయంగా ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పరస మహోత్సవాన్ని తిలకించడానికి సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఆలయం వెలుపల వివిధ వస్తువుల దుకాణాలు ఏర్పాటు చేసి చిరువ్యాపారులు విక్రయాలు జరిపారు. పెద్దసంఖ్యలో సమీప గ్రామాల ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకుని, పరసను తిలకించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో కె.గాయత్రి, ట్రస్ట్ బోర్డ్ చర్మన్ శంకర రెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.



వెంకోజీపాలెంలో పరసలో గృహోపకరణాల విక్రయ దుకాణాలు



ఆలయం వద్ద తోడ పెద్దు



రహదారిపై ఏర్పాటు చేసిన స్టాళ్లు

ఉత్సాహంగా ఆడుదాం.. ఆంధ్రా



షటిల్ జట్ల పోటీలకు టాస్ వేస్తున్న నిర్వాహకులు



ఇరు జట్లు మధ్య హోరాహోరీగా జరుగుతున్న పోటీ

ఎంవీపీ కాలనీ: ఆడుదాం.. ఆంధ్రా క్రీడలు ఏయూ ఇండోర్ జిమ్నాజియం వేదికగా ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ క్రీడల్లో భాగంగా గురువారం మండల స్థాయిలో షటిల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఏయూ ఇండోర్ స్టేడియంలో ఇండోర్ జిమ్నాజియం ఇన్‌చార్జి దొక్కర ప్రసాద్, కేడీపీఎం స్కూల్ పీఈటీ రత్నం, సచివాలయం ఎడ్యుకేషన్ కార్యదర్శి ఝాన్సీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం (151 సచివాలయం), రాజీవ్‌నగర్ (148) సచివాలయం పరిధిలోని క్రీడాకారులు పోటీ పడ్డారు. తొలుత నిర్వాహకులు టాస్ వేసి ఇరు జట్లు మధ్య పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం ఎడ్యుకేషన్ కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ ముందుగా రిజిస్ట్రార్ చేసుకున్న క్రీడాకారుల మధ్య షటిల్ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో పోటీలు అనంతరం నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. షటిల్ బ్యాడ్మింటెన్‌తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారు దగ్ధం



కారు నుంచి ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ

ఆరిలోవ: హెల్త్ సిటీ పక్కన బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న ఓ కారు గురువారం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ఈ రోడ్డులో ఓ కారు(టాటా వింగర్) మరమ్మతులకు గురికావడంతో ఏడాది నుంచి నిలిపి వదిలేశారు. ఇది ఎవరిదో తెలియదు. స్థానిక చిన్నారులు కొందరు గురువారం మధ్యాహ్నం ఈ కారు తలుపు తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులో ఉన్న పిల్లలు భయంతో బయటకు వచ్చి పరుగులు తీశారు. పెద్ద మంటలు, దట్టమైన పొగ రావడంతో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొందరు యువకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈలోగా యువకులు నీళ్లు చల్లి మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించారు. ఇంతలో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కారులో ఎగసిపడుతున్న మంటలను పూర్తిగా అదుపు చేశారు. అప్పటికే కారు అంతా దగ్ధమైంది. ఇదిలా ఉండగా పాడైన కారు నుంచి మంటలు ఎలా వచ్చాయో అనే దానిపై అగ్నిమాపక సిబ్బందికి కూడా స్పష్టత రాలేదు. పిల్లలు అగ్గిపెట్టెలు పట్టుకుని ఆడుకుంటూ పుల్లలు వెలిగించడం వల్లే కారులో సీట్లు కాలిపోయి మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నట్టు కొందరు స్థానికులు తెలిపారు.

1071వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



1071వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1071వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులతో పాటు ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాల పరిస్థితి నేటికీ దీనస్థితిలో ఉందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటేనే మంచిదని అన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

- శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువు దీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి కమనీయంగా కల్యాణం జరిపించారు. అర్చకులు టి.పి. రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.



నిత్యకల్యాణంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహగిరిపై 'స్వచ్ఛ తీర్థ'



సింహగిరిపై శుభ్రం చేయిస్తున్న ఉద్యోగి

సింహాచలం: సింహగిరిపై గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు స్వచ్ఛ తీర్థ కార్యక్రమం నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో సింహగిరిపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ రాజగోపురం వద్ద ఉన్న చెత్తను తొలగించారు. దేవస్థానం ఉద్యోగి లంక సూరిబాబు, శానిటేషన్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొర్రె దొంగతనం కేసులో ముగ్గురిపై కేసు

ఉక్కునగరం: గొర్రె దొంగతనం చేసిన కేసులో స్టీల్‌ప్లాంట్ పోలీసులు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వివరాలివి.. పరవాడ సమీప దేశపాత్రునిపాలేనికి చెందిన ఉరుకూటి పైడిరాజు కొన్ని గొర్రెలను మేపేందుకు గురువారం టౌన్‌షిప్‌లోని సెక్టార్–9కు తీసుకు వచ్చాడు. సాయంత్రం గొర్రెల మందలోని ఒక గొర్రె కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెదికారు. అనుమానం వచ్చి అదే సెక్టార్‌లోని 315బీ క్వార్టర్‌లోకి వెళ్లి చూడగా అక్కడ గొర్రె పీక కోసి ఉంది. పైడిరాజు తమ గొర్రెను స్టీల్‌ప్లాంట్ ఫోర్‌మన్ కొయ్యూరు గోపీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ ఎం.రమేష్‌కుమార్, కాంట్రాక్ట్ కార్మికుడు జి.శంకర్ నాయక్ అపహరించి చంపివేశారని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వి.శ్రీనివాసరావు నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్ని కేసు నమోదు చేశారు. గొర్రెను పోస్టుమార్టంకు పంపనున్నామని సీఐ తెలిపారు.

'ఉక్కు ఉద్యోగుల తొలగింపు సరికాదు'

ఉక్కునగరం: ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తగవని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. వాటిని ఐఎన్‌టీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం యూనియన్ నాయకులు సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఫ్టీను కలిసి సమస్యలపై చర్చించారు. సుమారు 1500 మంది తొలగిస్తారని వస్తున్న వార్తలు ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో అన్ని విభాగాలు సతమతమవుతుంటే ఉన్న ఉద్యోగులను తొలగించడమేమిటని ప్రశ్నించారు. సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బి.ఎస్.రాజు, కొమ్ము ప్రసాదరావు, కె.అవతారం, వి.ఎం.నాయుడు, సుబ్బయ్య, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను మొండి బకాయిలు రూ.6.12 కోట్లు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పన్ను చెల్లించని గృహ యజమానులకు జప్తు నోటీసులను అందజేస్తున్నారు. 1.20లక్షల అసెస్‌మెంట్లున్న గాజువాక జోన్‌లో ఇప్పటివరకు 60 శాతం ఆస్తి పన్ను వసూలైంది. ఈ బకాయిలు రూ.6.12 కోట్లు వసూలు కావాల్సి ఉందని రెవెన్యూ అధికారి రామనారాయణ తెలిపారు.